## క్లుప్తంగా...

### బాక్సింగ్ ఎంపికలు

**ఘట్‌కేసర్:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లా బాక్సింగ్ అండర్–14 బాలురు, అండర్–17 బాలబాలికల ఎంపిక సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో వచ్చేనెల 2వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల నిర్వాహణ కార్యదర్శి వినోద్‌కుమార్ తెలిపారు. పోటీలో పాల్గొనే అండర్–14 బాలురు, అండర్–17 బాలబాలికలు గురువారం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. క్రీడాకారుల అర్హత ఫామ్‌లో ఫొటోతో పాటు బోనాఫైడ్, ఆధార్ కార్డు, గతేడాది ప్రోగ్రెస్ కార్డు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని, సర్టిఫికెట్లపై హెచ్‌ఎం సంతకం, స్టాంప్ తప్పనిసరి ఉండాలని సూచించారు. ఫోన్: 9848629132, 8374461481.

### ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపునకు అనురాగ్ వలంటీర్లు



ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో డీన్‌లు విజయకుమార్, వసుధ భక్షి తదితరులు

**ఘట్‌కేసర్:** వెస్ట్‌జోన్ ఎన్‌ఎస్‌ఎస్ ప్రీ రిపబ్లిక్ డే–2023 పరేడ్ క్యాంపునకు వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ) ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు కుసుమ, అఖిల, మనీష ఎంపికయ్యారు. నవంబర్ 1–10 వరకు విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో వెస్ట్‌జోన్ ఎన్‌ఎస్‌ఎస్ ప్రీరిపబ్లిక్ డే–2023 పరేడ్ క్యాంపు జరగనుందని అనురాగ్ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ మల్లేశ్ తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన అభినందన సభలో ఇంజినీరింగ్ డీన్ విజయకుమార్, ఫార్మసీ డీన్ వసుధ భక్షి, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆఫీసర్లు నవీన్, కిరణ్‌కుమార్, అధ్యాపకులు, వలంటీర్లు క్యాడెట్లను అభినందించారు.

### మేడ్చల్‌లో పోలీసుల కవాతు



పోలీస్ కవాతులో ఏసీపీ, సీఐ

**మేడ్చల్‌రూరల్:** మేడ్చల్ పట్టణంలో సోమవారం పోలీసులు కవాతు నిర్వహించారు. కేఎల్ఆర్ వెంచర్‌లోని పలు కాలనీల్లో మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ నర్సింహరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు, ఓటర్లలో ధైర్యం నింపేందుకు కవాతు నిర్వహించినట్లు ఏసీపీ తెలిపారు. ఎస్ఐలు నవీన్‌రెడ్డి, క్రిష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

### అశోక్‌నగర్ రైల్వే ట్రాక్ వద్ద గంజాయి లభ్యం

**ఉప్పల్:** మల్లాపూర్ అశోక్ నగర్ రైల్వే ట్రాక్ వద్ద గంజాయి లభించింది. విశ్వసనీయ సమాచారం మేరకు ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు, సీఐ చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం రైల్వే ట్రాక్ వద్దకు గంజాయి వస్తుందన్న సమాచారం మేరకు రెండు కిలోల బరువు ఉన్న ఆరు గంజాయి ప్యాకెట్లు ట్రాక్ వద్ద లభ్యం కావడంతో వాటిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. వీటి విలువ దాదాపుగా రూ.3 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఉప్పల్ ఎక్సైజ్ టీం, అధికారులు ఉన్నారు.

### సీసీ కెమెరాలతో నేరాలకు చెక్

**బోడుప్పల్:** నేరాలను అదుపు చేయడంలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని బోడుప్పల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్ అన్నారు. చెంగిచర్ల శివదుర్గ కాలనీలో మాజీ వార్డు సభ్యులు కుర్రి శివశంకర్ సొంత నిధులు రూ.4.70 లక్షలతో ఏర్పాటు చేసిన 31 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సీసీ కెమెరాలతో దొంగతనాలు జరగకుండా పూర్తి నివారించవచ్చన్నారు. కెమెరాల ఏర్పాటుతో ఎలాంటి ఘటనలు జరిగినా క్షణాల్లో తెలుసుకోవచ్చన్నారు. సీసీ కెమెరాలు ఉండటం వల్ల అసాంఘిక కార్యకలాపాలు పాల్పడే వారికి భయం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, అధ్యక్షులు బింగి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, కాలనీ ప్రతినిధులు హరికృష్ణ, ప్రభాకర్ పాల్గొన్నారు.

### కాన్షీరాంకు కవి జయరాజ్ అభినందనలు

**మల్లాపూర్:** నగరంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ కుమారుడు సింగర్ నల్లా కాన్షీరాం శిల నీవే.. శిల్పం నీవే అనే పాటను పాడినందుకు ప్రముఖ గేయ రచయిత జయరాజ్ నల్లా కాన్షీరాంను అభినందించారు. అనంతరం జయరాజ్ మాట్లాడుతూ చిన్నారి నల్లా కాన్షీరాంకు ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. చిన్న వయస్సులోనే అందరినీ మంత్ర ముగ్ధుల్ని చేయడం అభినందనీయన్నారు.

# బీ కేర్‌ఫుల్

జంగ్ 2023 తెలంగాణ

**నామినేషన్ పత్రాల దాఖలులో జాగ్రత్త అవసరం**

- నవంబర్ 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం
- అభ్యర్థులు ఆర్‌ఓకు సమర్పించే పత్రాలే కీలకం
- జనరల్ అభ్యర్థులు రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేల డిపాజిట్ చేయాలి
- ఆర్‌ఓ వద్దకు అభ్యర్థితోపాటు నలుగురికి మాత్రమే అవకాశం



**సాక్షి, మేడ్చల్ జిల్లా:** అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నవంబర్ 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో.. నామినేషన్ల దాఖలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఎన్నికల సంఘం పలు సూచనలు చేస్తోంది. వీటిని ఖచ్చితంగా పరిగణనలోని తీసుకోవాల్సింటుందని పేర్కొంటుంది. ఈ నేపథ్యంలోనే నామినేషన్ దాఖలు చేసే సమయంలో అభ్యర్థులు సమర్పించనున్న పత్రాలకు అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. ఏ–ఫాం, బీ– ఫాం, అఫిడవిట్ తదితర అంశాల ప్రాముఖ్యతను అభ్యర్థులు పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం పేర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ పత్రాలను దాఖలు చేసే అభ్యర్థిని ప్రతిపాదించే వ్యక్తి సంబంధిత నియోజకవర్గంలో ఓటరై ఉండాలి. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్రస్థాయి పార్టీలకు చెందిన అభ్యర్థిని అతను పోటీ చేస్తున్న నియోజకవర్గ పరిధిలోని ఓటరు ప్రతిపాదించాల్సింటుంది. స్వతంత్ర, గుర్తింపు లేని పార్టీల అభ్యర్థులను మాత్రం పది మంది ఓటర్లు ప్రతిపాదించాల్సి ఉంటుంది. ప్రతిపాదించే వారు తన ఓటరు జాబితా వివరాలను కూడా సమర్పించాల్సి ఉంటుంది.

- అభ్యర్థి నేరుగా లేదా తనను ప్రతిపాదించే వ్యక్తి నామినేషన్ పత్రాలను దాఖలు చేసేందుకు అవకాశముంది. అసెంబ్లీ నియోజకవర్గ స్థానంలో

నామినేషన్ దాఖలుకు అభ్యర్థి వయస్సు 25 ఏళ్లు నిండి ఉండాలి. తెలంగాణ రాష్ట్ర పరిధిలోని ఏదైనా అసెంబ్లీ నియోజకవర్గంలో బరిలో నిలిచే అభ్యర్థికి ఖచ్చితంగా ఓటు హక్కు కలిగి ఉండాలి. నామినేషన్ పత్రాలు దాఖలు చేసే సమయంలో అభ్యర్థితో పాటు నలుగురి వ్యక్తులను మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతిస్తారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జనరల్ స్థానంలో పోటీచేసే అభ్యర్థి రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5 వేలు డిపాజిట్(ధరావతు) చెల్లించాల్సి ఉంటుంది. ఈ డిపాజిట్ సొమ్మును బ్యాంకు చలానా రూపంలో చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రాన్ని నామినేషన్ పత్రంతో జత చేయాలి. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా తెరవాల్సి ఉంటుంది. ఈ బ్యాంకు ఖాతా ద్వారానే ఎన్నికల ఖర్చుల లావాదేవీలు నిర్వహించాల్సి ఉంది. బ్యాంకు ఖాతా వివరాలను నామినేషన్ పత్రంలో తప్పనిసరిగా పేర్కొనాలి. అభ్యర్థి పది పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను నామినేషన్ పత్రంతో జతపరచాలి. నామినేషన్ పత్రాల దాఖలు సమయంలో రిటర్నింగ్ అధికారి ఎదుట అభ్యర్థి ప్రతిజ్ఞ చేయాల్సింటుంది. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్రస్థాయి పార్టీల అభ్యర్థులు తమ నామినేషన్ పత్రంతో పాటు పార్టీ జారీ చేసిన ఏ–ఫాం, బీ–ఫాం పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థి తన నేర చరిత్ర, తనపై నమోదైన పోలీసు కేసులు, ఇతరత్రా కోర్టులో విచారణలో ఉన్న కేసుల వివరాలతో సహా తనతోపాటు, భార్య, పిల్లల స్థిర, చరాస్తులు, అప్పులు, బ్యాంకులో డిపాజిట్లు, నగదు నిల్వ వివరాలు వెల్లడిస్తూ అఫిడవిట్ (ప్రమాణ పత్రం) సమర్పించాల్సి ఉంటుంది.

**బీ–ఫాం అంటే..**

పార్టీ తరపున ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేసే పత్రమిది. తమ పార్టీ నుంచి ఫలానా వ్యక్తి పోటీ చేస్తున్నారని, పార్టీ గుర్తు కేటాయించాలని అభ్యర్థించటమే ఈ బీ–ఫాం పత్రం ముఖ్యోద్దేశం.

**ఏ ఫాం అంటే..**

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థిని ధ్రువీకరించేందుకు జాతీయ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్రస్థాయిలో ఒకరికి అధికారం అప్పగిస్తారు. అభ్యర్థికి సదరు వ్యక్తి బీ– ఫాం జారీ చేస్తారు. రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన పార్టీ అధ్యక్షుడు తాను లేదా మరొకరికి, లేదా జిల్లాస్థాయిలో ఒకరికి బీ–ఫాం జారీచేసే అధికారాన్ని అప్పగిస్తుందని ఏ– ఫాం సూచిస్తోంది. ఏ– ఫాం ద్వారా అధికారం పొందిన వ్యక్తి పోటీచేసే అభ్యర్థికి బీ–ఫాం ఇస్తారు. ఏ–ఫాం, బీ–ఫాం పత్రాలు నామినేషన్ దాఖలు సమయంలో లేదా నామినేషన్ పత్రాల దాఖలు చివరి రోజు మధ్యాహ్నం 3 గంటల్లోగా సంబంధిత రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ)కి అందించాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల సంఘం పేర్కొంటోంది.

## బీఆర్‌ఎస్‌ను ఆదరించండి

**మేయర్ మేకల కావ్య**



జవహర్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మేయర్ కావ్య, చామకూర శాలినిమహేందర్‌రెడ్డి

**జవహర్‌నగర్:** జవహర్ నగర్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో మేయర్ మేకల కావ్య, చామకూర శాలినిమహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర చేస్తూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మేయర్ కావ్య మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ హయాంలోనే జవహర్‌నగర్ కార్పొరేషన్ రూపురేఖలు మారిపోయాయన్నారు. జవహర్‌నగర్‌ను అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత మంత్రి మల్లారెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజలు బీఆర్‌ఎస్‌ను ఆదరించి కారు గుర్తుకు ఓటు వేసి మంత్రి మల్లారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, పార్టీ అధ్యక్షుడు కొండల్‌ముదిరాజ్, నాయకులు అహ్మద్‌పాషా, మహేష్, వెంకటేష్, శ్రీలత, కృష్ణవేణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా..

**మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్**



మాట్లాడుతున్న మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్


**జవహర్‌నగర్:** జవహర్‌నగర్ కార్పొరేషన్ అరుంధతినగర్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమానికి హాజరైన మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్‌లో ఇకపై మల్లారెడ్డి ఆటలు సాగవని, మాయమాటలతో పబ్బం గడిపారన్నారు. జవహర్‌నగర్‌కు ఆయన చేసిందేమీలేదన్నారు. జవహర్‌నగర్‌లోని పలువురు బీఆర్‌ఎస్ నేతలే ఆయనను చీదరిస్తున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాలను అక్కున చేర్చుకున్న పార్టీ కాంగ్రెస్ అని, తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి ఒక్కసారి తనకు అవకాశం ఇవ్వాలని, అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కారింగుల నిహారికగౌడ్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్, నాయకులు సదానంద్, రాజుయాదవ్, వినయ్‌కుమార్, అశోక్, మిట్టు, శ్రీనివాస్, రేసు లక్ష్మీ, సరిత తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్**

**సాక్షి, మేడ్చల్ జిల్లా:** అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌ను సజావుగా నిర్వహించేందుకు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్ అన్నారు. సోమవారం న్యూఢిల్లీ నుంచి సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ, సన్నద్ధతపై వీడియో సమావేశం నిర్వహించగా, హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి వికాస్ రాజ్, మేడ్చల్ కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్, జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, డీసీపీ శబరీష్, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచనలు పాటిస్తున్నామని తెలిపారు. జిల్లాలో గ్రీవెన్స్ కమిటీకి ఇప్పటి వరకు నగదు, బంగారం తదితరాలకు సంబంధించి 165 ఫిర్యాదులు రాగా, అందులో 113 డిస్పోజల్ చేయడం జరిగిందన్నారు. ఆరింటిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, 46 ఆధారాలు లేని దరఖాస్తులు ఉన్నాయని తెలిపారు.

## అవినీతి ప్రభుత్వాన్ని తరిమికొడదాం



గడప గడపకు ప్రచారంలో వజ్రేష్‌యాదవ్

వజ్రేష్‌యాదవ్

**బోడుప్పల్:** అవినీతి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని తరిమికొడదామని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సాయిరాంనగర్, న్యూ మారుతీనగర్, బృందావన్ కాలనీల్లో నిర్వహించిన గడప గడప కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొంది, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేయనున్నట్లు వెల్లడించారు. ఆరు గ్యారెంటీ పథకాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. కార్యకర్తలు, నాయకులు కష్టపడి కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, నేతలు బొమ్మక్ రమేష్, రాపోలు శంకరయ్య, కిషన్‌చారి, తోటకూర రవీందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అనుక్షణం అప్రమత్తం

- ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



**సాక్షి, మేడ్చల్ జిల్లా:** ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం సంబంధిత జిల్లా ఎన్నికల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థికి తప్పనిసరిగా ఓటరు జాబితా వివరాలు అందించాలని, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించే సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అభ్యర్థుల సమక్షంలో ఈవీఎం యంత్రాల రెండవ ర్యాండమైజేషన్ చేపట్టాలని, అభ్యర్థులు అధికంగా ఉంటే సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ ఓటర్ నమోదు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పోలింగ్ సక్రమంగా జరిగేందుకు ఓటరు స్లిప్పులను పంపిణీ చేయాలన్నారు. ఈవీఎం యంత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు. ఈవీఎం యంత్రాలు తరలించే అధికారులకు అవసరమైన భద్రత కల్పించాలన్నారు.

**3 నుంచి క్షేత్రస్థాయి పర్యటన**

పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలన్నారు. పోలింగ్ సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మోడల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులకు ప్రత్యేక వసతులు కల్పించాలన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులకు, అత్యవసర సేవల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, నిబంధనలు తప్పకుండా అమలు చేయాలన్నారు. సీ–విజిల్ యాప్‌ను ప్రజల్లోకి మరింత తీసుకెళ్ళాలన్నారు. మీడియా సెంటర్లు ఏర్పాటు చేయాలని, ఎన్నికల రికార్డులకు సంబంధించి ప్రతి అంశం భద్రపరచాలని పేర్కొన్నారు. వచ్చేనెల 3 నుంచి ఎన్నికల పరిశీలకుల క్షేత్రస్థాయి పర్యటన ఉంటుందని సన్నద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ఈఆర్వోలు, ఎన్నికల నోడల్ అధికారులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

**అత్యవసర సేవల విభాగాలకు పోస్టల్ బ్యాలెట్**

ఎన్నికల నేపథ్యంలో అత్యవసర సేవల పరిధిలోకి వచ్చే వివిధ విభాగాలకు ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించిందని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. 13 శాఖలకు సంబంధించిన వారికి బ్యాలెట్ ఓట్లు వేసేందుకు ప్రత్యేకంగా అవకాశం ఉందన్నారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, భారతీయ రైల్వే, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో, విద్యుత్తు శాఖ, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, రాష్ట్ర రవాణా సంస్థ, ఆహారం, పౌర సరఫరాలు, బీఎస్ఎన్ఎల్, పోల్ డే కవరేజ్ కోసం ఈసీఐ(ఈసీఐ) ద్వారా అధికారం పొందిన మీడియా వ్యక్తులు, అగ్నిమాపక సేవలు తదితర విభాగాలు విధుల్లో నిమగ్నమై ఓటు హక్కును వినియోగించుకోలేని వారు మాత్రమే దరఖాస్తులను ఫారం –12(డీ)లో పూర్తి వివరాలతో సంబంధిత రిటర్నింగ్ అధికారులకు 3వ తేదీ నుంచి 7 వరకు సమర్పించాలని సూచించారు. దరఖాస్తు ఫారాలను రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారుల నుంచి పొందవచ్చన్నారు. ఎన్నికల సంఘం పోర్టల్ నుంచి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

**నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి**

అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ వచ్చేనెల 3 నుంచి ప్రారంభం కానుండటంతో జిల్లాలోని ఐదు నియోజకవర్గాల రిటర్నింగ్ కార్యాలయాల వద్ద నామినేషన్ల కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఆర్వోలు, ఈఆర్వోలతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల స్వీకరణ, వాటి పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణ వంటి అంశాలు చాలా కీలకమైనవని, వాటిపై క్షుణ్ణంగా అవగాహన పెంచుకోవాలని సూచించారు. అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. నామినేషన్లు స్వీకరించే మొదటి రోజు నుంచి ప్రక్రియ ముగిసే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రతిరోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కార్యాలయానికి వంద మీటర్ల దూరం వరకు రోడ్డును మూసివేయాల్సి ఉంటుందన్నారు.

## ప్రత్యర్థులకు డిపాజిట్లు రాకుండా పనిచేయాలి



మరుగుజ్జు ఉన్న వారిని భుజాన ఎత్తుకున్న మంత్రి మల్లారెడ్డి

**మేడ్చల్‌రూరల్:** బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి ప్రత్యర్థులకు డిపాజిట్ రాకుండా చేయాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని నిమ్మల గార్డెన్‌లో సోమవారం మేడ్చల్ మండల బీఆర్‌ఎస్ బూత్ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు గ్రామాలను పట్టించుకోలేదని, ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి ఒక్కరోజు కూడా మేడ్చల్‌కు రాలేదని, అభివృద్ధికి రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. తాను సొంత నిధులు వెచ్చించి గ్రామాల్లో సీసీ రోడ్లు, భవనాలు నిర్మించానని వివరించారు. ఇన్ని పనులు చేసిన తనను ప్రజలే గెలిపించుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. తనకు భగవంతుడు అన్నీ ఇచ్చాడని, ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లో ఉన్నానని, రాష్ట్రంలోని ఏ నియోజకవర్గంలో రానంత భారీ మెజార్టీతో గెలవాలన్నదే తన కోరిక అని తెలిపారు. అందుకు ప్రతి కార్యకర్త నిత్యం ప్రజల్లో ఉండి కేసీఆర్ పాలనలో ప్రజలకు చేకూరిన లబ్ధి, ఎన్నికల మానిఫెస్టో ఇంటింటికీ వివరించి బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సమావేశం అనంతరం మరుగుజ్జు కలిగిన వారిని భుజాన ఎత్తుకుని మంత్రి ఫొటోలు దిగారు.

**రేవంత్‌రెడ్డి పెద్ద బ్లాక్‌మెయిలర్...**

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఓ పెద్ద బ్లాక్‌మెయిలర్ అని గతంలో నన్ను బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు దండుకుని తన కూతురు పెళ్లి చేశాడని ఆ విషయంలో తాను యాదాద్రి నరసింహుడి సన్నిధిలో ప్రమాణం చేయాలని కోరిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఇప్పుడు టికెట్లు అమ్ముకుంటున్నాడని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో చేసిందేమీ లేదని, వారు ఏ ముఖం పెట్టుకుని ప్రజల వద్దకు ఓట్లు అడగడానికి వెళ్తారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నిలిచిందని, ప్రజలంతా కేసీఆర్ మళ్లీ రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో నా వద్ద రూ.5 కోట్ల ప్యాకేజీ తీసుకున్నాడని, ఇప్పుడు కాంగ్రెస్ వద్ద ప్యాకేజీ తీసుకుని అభ్యర్థి వెంట తిరుగుతున్నాడని ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి దొంగ ప్లాట్లు అమ్ముకుని సీటు తెచ్చుకున్నాడని, కబ్జాలకు పాల్పడే వ్యక్తికి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.

**అల్లుడు రాజశేఖర్‌రెడ్డి గెలుపు ఖాయం...**

మైనంపల్లి ఓ పెద్ద గుండా అని కబ్జాలు చేసుడే తప్ప అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. తమ పార్టీలో నుంచి వెళ్లాక మైనంపల్లి కాస్త మైనం పిల్లిగా మారాడని ఎద్దేవా చేశారు. మల్కాజిగిరిలో అల్లుడు రాజశేఖర్‌రెడ్డి గెలుపు ఖాయమన్నారు. నిత్యం గుండాలను వెంట పెట్టుకుని తిరగకుండా దమ్ముంటే తనలా సింగిల్‌గా తిరగాలని కోరారు. మైనంపల్లి ఆగడాలు ఆపకపోతే ఎన్నికలయ్యేలోపే జైలుకు వెళ్తాడని తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, జిల్లా రైతు బంధు అధ్యక్షుడు నందారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, ఎంపీపీ రజిత, జెడ్పీటీసీ శైలజ, జిల్లా గ్రంథాలయాల చైర్మన్ దయాకర్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి సుదర్శన్, వైస్ ఎంపీపీ, పీఏసీఎస్ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రచార రథం.. ప్రారంభం..



బీఆర్‌ఎస్ ప్రచార రథం



కాంగ్రెస్ ప్రచార రథాలకు పూజలు

**మేడ్చల్:** ఎన్నికలంటేనే హడావుడి.. ఉదయం నుంచి సాయంత్రం వరకు మైకుల మోత మోగాల్సిందే.. ఎన్నికలకు నెల రోజుల సమయం ఉండటంతో మేడ్చల్‌లో మైకుల మోత షురైంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు ప్రచార రథాలను ప్రారంభించారు. ఉదయం ఆయా కాలనీలు, రోడ్లపై ప్రచార రథాలు చక్కర్లు కొట్టాయి. బీఆర్‌ఎస్ తరపున ప్రచార రథాలతో పాటు కళాకారులతో కలిసి మొదలుపెట్టారు. నేతలు, పార్టీలు, ఆయా పార్టీల మేనిఫెస్టోలోని అంశాలపై పాటలు రూపొందించి మైకుల ద్వారా ప్రచారాలు సాగిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మూడు రథాలను సిద్ధం చేసి ప్రారంభించింది. చౌరస్తాలు, జనం అధిక సంఖ్యలో ఉండే ప్రాంతాల్లో రథాలతో ప్రచారం సాగిస్తున్నారు.

## మల్లన్నను మరోసారి గెలిపించుకుందాం



నాగారంలో ఎన్నికల ప్రచారంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

**కీసర:** మంత్రి మల్లారెడ్డి గెలుపు ఖాయమని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రాత్రి మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపునకు దోహదం చేస్తాయన్నారు. మంత్రి మల్లారెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించారన్నారు. అభివృద్ధిని పరిగెత్తించిన మల్లన్నను మరోసారి గెలిపించుకుందామన్నారు. వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మల శ్రీనివాస్, కౌన్సిలర్లు కౌకుట్ల అనంతరెడ్డి, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, నేతలు కౌకుట్ల రాహుల్‌రెడ్డి, అన్నంరాజు లావణ్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.